క్లుప్తంగా

రాజాంలో కూటమి అభ్యర్థిని ఓడిస్తాం

● జనసేన రాజాం ఇన్‌చార్జి ఎన్ని రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ రాజాం ఇన్‌చార్జి ఎన్ని రాజు

రాజాం: రాజాంలో కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను ఓడిస్తామని జనసేన పార్టీ రాజాం ఇన్‌చార్జి ఎన్ని రాజు తెలిపారు. రాజాంలోని జనసేన పార్టీ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పార్టీ కార్యకర్తలతో కలిసి సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజాంలో చేపట్టే కార్యక్రమాలకు జనసేన పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆహ్వానించడం లేదని, కోండ్రు మురళీమోహన్ తమను చిన్నచూపు చూస్తున్నారని వాపోయారు. కొన్నిసార్లు ఎగతాళిగా మాట్లాడుతున్నారన్నారు. తన గెలుపునకు జనసేనతో పనిలేదంటూ కొన్ని చానళ్లలో ఇంటర్వ్యూ కూడా ఇచ్చారన్నారు. ఐదురోజుల్లో పార్టీ నుంచి స్పష్టమైన సమాచారం రాకుంటే రెబల్ అభ్యర్థిగా రాజాంలో పోటీచేస్తామని వివరించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నాలుగు ఎంపీపీ స్థానాలు, జెడ్పీటీసీ స్థానాలు జనసేన అభ్యర్థులకు కేటాయించేందుకు అంగీకరిస్తేనే కూటమి అభ్యర్థికి సహకరిస్తామని, లేదంటే ఓడిస్తామన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పట్టణంలోని సూర్యా రెసిడెన్సీ పక్కన నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ హాజరు కానున్నారని కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

తెర్లాం: బొబ్బిలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించే నియోజకవర్గ స్థాయి సమావేశానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు హాజరుకావాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు పిలుపునిచ్చారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

బొబ్బిలి: భోజరాజపురం వద్ద ఉన్న పంపింగ్ కేంద్రం మరమ్మతులకు గురికావడంతో బొబ్బిలి పట్టణంలో బుధవారం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. మరమ్మతుల అనంతరం తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి

బొబ్బిలి: పట్టణంలోని వీధులు, కాలువలు శుభ్రంగా ఉండాలని, ఎక్కడా అపారిశుద్ధ్యం కనిపించరాదని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని కొత్త ఎరుకల వీధి, సింగారపు వీధి, తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి కార్మికులకు పలు సూచనలు చేశారు.

70 మద్యం బాటిళ్లు సీజ్

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 70 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఇ.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బూరాడ జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న వారి వద్ద మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

డంపింగ్ యార్డులో మంటలు

రాజాం సిటీ: మండలంలోని గార్రాజుచీపురుపల్లి సమీపంలోని ఉన్న డంపింగ్‌యార్డులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. సోమవారం ఉదయానికి మంటలు అధికమై చుట్టు పక్కల గ్రామాలకు పొగ వ్యాపించింది. స్థానికులు మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం చేరవేశారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పరిసర గ్రామాల ప్రజలు, రైతులు డంపింగ్‌యార్డు వైపు తాత్కాలికంగా రాకపోకలు సాగించవద్దని సూచించారు. యార్డులో మంటలు పెట్టేవారిపై నిఘా ఏర్పాటు చేయనున్నామన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట సోమవారం ఘనంగా జరిగింది. వేదపండితులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



నాడు: గోతులమయమైన లింగాపురం-తెర్లాం రోడ్డు



నేడు: రూ.కోటీ 70లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు

తీరిన రహదారి కష్టాలు...

తెర్లాం మండలంలోని తెర్లాం జంక్షన్ నుంచి లింగాపురం వరకు ఉన్న రోడ్డు గోతులతో అధ్వానంగా ఉండేది. దీంతో రాకపోకలకు ప్రజలు, వాహనచోదకులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరినైనా ఆస్పత్రికి తరలించాలన్నా పడరాని పాట్లు పడాల్సి వచ్చేది. కనీసం 108,104 వాహనాలు కూడా రాలేని పరిస్థితి ఉండేది. దీంతో రహదారి దుస్థితిని లింగాపురం సర్పంచ్ బూరాడ తవిటినాయుడు, తదితరులు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ప్రభుత్వం నుంచి కోటీ 70 లక్షల రూపాయల నిధులు విడుదల చేయించి లింగాపురం నుంచి తెర్లాం పీహెచ్‌సీ వరకు తారు రోడ్డు వేశారు. అలాగే రాజాం పట్టణంలో జీఎంఆర్ ఐటీ నుంచి రేగిడి మండలం సంకిలి వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవున రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.8.82 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తయితే ఈ మార్గంలో ఉన్న గ్రామాలకు రాకపోకలు సులభతరమవుతాయి.

– తెర్లాం, రేగిడి



నాడు: గుంతలతో నిండిన రాజాం-పాలకొండ రహదారి



నేడు: కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు

ఎమ్మెల్యే పరామర్శ

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామ మాజీ సర్పంచ్ కోనారి వెంకన్న కుటుంబాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకన్న ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి గ్రామానికి వెళ్లి వెంకన్న మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన బోను ఎర్రమ్మ, కోనారి రాము కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రగాఢ సంతాపం తెలియజేయడంతో పాటు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నెమలాం సర్పంచ్ నరసింహులు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు, విజయరాంపురం, రంగప్పవలస సర్పంచ్‌లు బూరి మధుసూదనరావు, శనపతి రాంబాబు తదితరులు ఉన్నారు.



మాజీ సర్పంచ్ కోనారి వెంకన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

సోమరాజుపేట యువత ఔదార్యం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామ యువత తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన బోడసింగి చిన్నారావు, భూలక్ష్మి కుమారుడు బోడసింగి గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. తోటి స్నేహితుడిని ఆదుకోవాలన్న సంకల్పంతో గ్రామానికి చెందిన రమేష్‌నాయుడు యూత్ సభ్యులు రూ.లక్ష సేకరించారు. సోమవారం ఈ మొత్తాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేతులు మీదుగా గణేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ సవలాపురపు రమేష్‌నాయుడు, వన్నలి, లక్ష్మిపురం, అప్పాపురం, చాటాయివలస సర్పంచ్‌లు గార రమణ, కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, కరణం గోవిందరావు, ఎఫ్‌ఏ బోడసింగి నాగరాజు, మాజీ ఎంపీటీసీ బోడసింగి నర్సింహం అప్పారావునాయుడు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

బాడంగి: మండలంలోని పూడివలస గ్రామంలో టీడీపీకి చెందిన 11 యాదవ, కొప్పులవెలమ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆయా కుటుంబాలకు చెందిన వారంతా సచివాలయ కన్వీనర్ పూడి బాల ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 58 నెలలుగా సీఎం జగనన్న పేదలకు ఎంతో మేలు చేశారని, ఆయన అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై తామంతా పార్టీలో చేరినట్లు చెప్పారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం శక్తివంచన లేకుండా కష్టపడాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో వందరాపు సన్యాసి, గణేష్, పోలయ్య, త్రినాథ, సరాబోను అచ్చమ్మ, తవుడు, పూడి ఉదయ్, గంట పవన్, ఆవాల అప్పలనాయుడు, రెడ్డి మురళి, పూడి శంకరరావు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, తెంటు తరుపతినాయుడు, రామినాయుడు, గండి శంకరరావు, గొర్లె శంకరరావు, తెర్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో పార్టీలో చేరిన పూడివలస గ్రామస్తులు

పింఛన్ల పంపిణీలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: ఈ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీలో అలసత్వం వద్దని ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల నుంచి పింఛన్లను వలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయాల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సిబ్బంది సహకరించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న మందుగుండు పట్టివేత

సంతకవిటి: అక్రమంగా మందుగుండును తరలిస్తున్న వ్యక్తిని ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ పట్టుకుని సంతకవిటి పోలీసులకు అప్పగించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌ఛార్జ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ సోమవారం తెలిపారు. మందుగుండ తయారీదారైన జి.సిగడాం మండలం పెనసాం గ్రామానికి చెందిన గొర్లె సాయికుమార్‌తో పాటు, మందుగుండ ఆర్డర్ చేసిన మండాకురిటి గ్రామానికి చెందిన ఘంటా వీరస్వామిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

బాడంగి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించినందున ఈ నెల పింఛన్‌ను గ్రామ సచివాలయాల్లో ఈ నెల 3 నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేయడం జరగదని, లబ్ధిదారులే సచివాలయానికి వచ్చి పింఛన్లు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పింఛన్ కోసం వచ్చేటప్పుడు ఆధార్ కార్డు లేదా ఏదైనా ఇతర గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలని సూచించారు. పింఛన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సచివాలయ సిబ్బందికి లాగిన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మంచంపై నుంచి లేవలేని వారికి ఏ విధంగా పంపిణీ చేయాలనే దానిపై తరువాత తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

రామభద్రపురం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ నెల పింఛన్లను గ్రామ సచివాలయాల్లో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ ఈశ్వరమ్మ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రతీ నెల వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు పంపిణీ చేశారని, సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికలు ముగిసేవరకు గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు లేదా మరేదైనా గుర్తింపు కార్డు వెంట పట్టుకుని వెళ్లాలని, పింఛను పుస్తకం తీసుకువెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.



బాడంగి: కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

ఐదేళ్లలో అందించిన సంక్షేమాన్ని గుర్తుచేయండి

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని 8, 26, 29 వార్డుల్లో సోమవారం రాత్రి బూత్ లెవెల్ సమావేశాలను నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ బెల్లాన మాట్లాడుతూ.. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా వారికి అందించిన లబ్ధిని వివరించాలన్నారు. ముఖ్యంగా గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలకు తెలియజేయాలన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తే.. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతీ హామీని అమలు చేశారన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో 99 శాతానికి పైగా హామీలను అమలు చేయడమే కాకుండా, అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని ప్రజలకు మరోమారు వివరించాలన్నారు. జేసీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, వార్డు ఇన్‌ఛార్జిలు, మున్సిపల్ కౌన్సిలర్లు, బూత్ లెవెల్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన, పక్కన ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

రాజాం: బొద్దాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ వై. దుర్గారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం పరిశీలించి, 80 మందికి 75 మంది హాజరైనట్లు గుర్తించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. హెచ్‌ఎం వై.కృష్ణకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

ఉపాధి వేతనం పెంపు

రేగిడి: గ్రామాల్లో ఉపాధిహామి పనులు చేసుకుంటే రూ.300లు వేతనం వస్తుందని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో చిన్నగెడ్డలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. రెండు పూటలా కొలతలు ప్రకారంగా పనిచేస్తే ప్రతి వేతనదారునికి రూ.300లు వేతనం వస్తుందన్నారు. ఉపాధి పనులు వద్ద తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని టీఏలకు సూచించారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం



తలే రాజేష్‌కు స్వాగతం పలుకుతున్న కింజంగి గ్రామస్తులు

● మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకుందాం
● రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

వంగర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ అన్నారు. పేదలకు అండగా ఉంటూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలను కోరారు. మండలంలోని కొనంగిపాడు, ఇరువాడ, చౌదరివలస, చంద్రంపేట, కింజంగి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు మరిచర్ల విజయలక్ష్మి, గంగారావు, సర్పంచ్‌లు చందక తాతబాబు, పెద్దిరెడ్డి విజయ, గుంట విజయమ్మ, బొంతు వెంకటరావు, వేమిరెడ్డి సూర్యనారాయణ, బెజ్జిపురం విజయ్‌కుమార్, తెంటు జోగినాయుడు, కిమిడి సన్యాసినాయుడు, కిమిడి చిట్టిబాబు, పారిశర్ల రామకృష్ణ, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే పల్లెల్లో ప్రశాంతత

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ఆధ్యాత్మికతతోనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతత నెలకొంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఆరికతోటలో సోమవారం నిర్వహించిన వేంకటేశ్వరస్వామి ఆలయం 14వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణంలో సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీ పెంకి శేఖర్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వర్రి శివుడు, బుగత రాములు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు తదితరులు ఉన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

జవహర్ నవోదయకు ఎంపిక

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామానికి చెందిన విద్యార్థిని బత్తిన చందనకృతి జవహర్ నవోదయకు ఎంపికైంది. మండలంలోని పాములవలస ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచింది. ఈమె తండ్రి బత్తిన సురేష్ పాములవలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 209 మార్కులు సాధించింది. విద్యార్థినిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.



బత్తిన చందనకృతి

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కాంబోతుల పూజశ్రీ జవహర్ నవోదయకు ఎంపికైంది. నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి తొమ్మిదో తరగతిలో సీటు పొందింది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



పూజశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చంద్రబాబు కుయుక్తులతో అవ్వాతాతలకు కష్టాలు

బాడంగి: ప్రతిపక్షాల కుట్రలతో పింఛన్‌దారులకు ఇబ్బందులు మొదలయ్యాయని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, తెంటు మధుసూదనరావు, సచివాలయ కన్వీనర్లు మూడడ్ల భాస్కరరావు, తెర్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రతీ నెల ఒకటో తేదీన వలంటీర్లు పింఛన్ లబ్ధిదారుల ఇంటి వద్దకు వచ్చి డబ్బులు అందించేవారని, ఈ నెల నుంచి లబ్ధిదారులు గ్రామ సచివాలయాలకు వెళ్లి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనంతటికీ కారణం చంద్రబాబు అండ్ కో అని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని వలంటీర్ల సేవలపై ఈసీకి ఫిర్యాదు చేయడంతో వారి సేవలను వినియోగించరాదని ఈసీ ఆదేశించిందన్నారు. ప్రతిపక్ష నాయకుల చర్యలతో అవ్వాతాతలు, దివ్యాంగులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వలంటీర్ వ్యవస్థతో సీఎం జగన్‌కు మంచిపేరు వస్తోందన్న అక్కసుతోనే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుయుక్తులు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

రేగిడి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్సై ఇ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం పర్యటించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించారు. ప్రజలంతా సోదరభావంతో మెలగాలని, వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు. లేనిపోని గొడవలకు పాల్పడితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు పాల్గొన్నారు.

పట్టణంలో పోలీసుల కవాతు

రాజాం సిటీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక బొబ్బిలి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో అల్లర్లు సృష్టించేందుకు యత్నించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకావద్దని, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, సీఐలు డి.మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్సైలు పాల్గొన్నారు.



లక్ష్మీపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్